## సరిగ్గా వైద్యం చేయలేదు.. అందుకే చనిపోతున్నా

**డాక్టర్ పేరు సూసైడ్ నోట్‌లో రాసి ఉరేసుకున్న దేవేందర్**

హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న తనకు కేఎంసీ సూపర్ స్పెషాలిటీలోని ప్రముఖ వైద్యుడు సరిగ్గా వైద్యం చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాసి చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలివేల్పుల గ్రామానికి చెందిన పసునూరి దేవేందర్ కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం కాకతీయ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రముఖ వైద్యుడి దగ్గరికి వెళితే సరిగ్గా వైద్యం చేయలేదు. అందుకే చనిపోతున్నానని, తన చావుకు ఆ డాక్టర్ కారణమని చెప్పి సూసైడ్ నోట్ రాశాడు. అనంతరం ఆదివారం రాత్రి ఈదులకుంట చెరువు వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరి మృతి

**మృతులు బీహార్ వాసులు**

ఎల్కతుర్తి, మార్చి 18 : జీవనోపాధి కోసం మండలానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వలో పడి మృతి చెందారు. తోటి కార్మికులు, ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బీహార్ రాష్ట్రంలోని గయా జిల్లా సౌతి గ్రామానికి చెందిన అనిల్ కుమార్(24), దీపక్‌కుమార్ (20) జీవనోపాధి కోసం ఎల్కతుర్తికి వచ్చారు. ఇక్కడి రాందేవ్‌కు చెందిన లక్ష్మీగణపతి గ్రానైట్ కంపెనీలో వారం రోజుల నుంచి పని చేస్తున్నారు. ఈ నెల 16న ఎస్సారెస్పీ కెనాల్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. మొదటగా అనిల్ అనే వ్యక్తి కెనాల్‌లో కొట్టుపోతుండగా, అతడిని కాపాడేందుకు దీపక్‌కుమార్ ప్రయత్నించాడు. దీంతో ఇద్దరూ కొట్టుకుపోయారు. వీరితో పాటు చేపల వేటకు వెళ్లిన అరుణ్, మనోజ్‌రాం కంపెనీ యాజమాన్యానికి సమాచారం అందించడంతో వారు అక్కడికి వెళ్లి చూసే సరికి కనిపించలేదు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటి ఉధృతిని తగ్గించడంతో జిల్లాలోని చింతగట్టు, గీసుకొండ సమీపంలోనిలోని కాల్వల్లో ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## నీటి సంపులో పడి వ్యక్తి..

ఖానాపురం, మార్చి 18 : నీటి సంపులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కొత్తూరులో సోమవారం జరిగింది. ఎస్సై రఘునాథ్, బాధితుల కథనం ప్రకారం.. కొత్తూరుకు చెందిన కడారి(40) వృత్తి రీత్యా హమాలీ. గ్రామంలో ఇటీవల చనిపోయిన తన బంధువు ఇంటికి 3వ రోజు కార్యక్రమానికి తన తల్లి కొమురమ్మ, సోదరుడు కుమారస్వామితో కలిసి వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి ఒక్కడే ఇంటికి వచ్చాడు. కొద్ది సమయానికి తల్లి, సోదరుడు ఇంటికి వచ్చి కాళ్లు కడుక్కుందామని నీటి సంపు వద్దకు వెళ్లగా.. రవి సంపులో కనిపించాడు. ఇతరుల సాయంతో అతడిని బయటకు తీశారు. అయితే, రవి అప్పటికే మృతి చెందాడు. కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడని మృతుడి తల్లి తెలిపారు. రవికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ వివాహిత..

చెన్నారావుపేట, మార్చి 18 : చికిత్స పొందు తూ వివాహిత మృతిచెందిన ఘటన చెరువుకొమ్ముతండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్యా ఝాన్సీ(22)కి అనారోగ్యం కారణంగా గర్భసంచి ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక ఈ నెల 11న ఇంట్లో గడ్డి మందు తాగింది. ఆమెను వరంగల్ ఎంజీఎం దవఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఝాన్సీ భర్త గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ..

రవీందర్(ఫైల్)

ఆత్మకూరు, మార్చి18 : విద్యుదాఘాతంతో తాపీమేస్త్రీ మృతిచెందిన ఘటన మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ నాంపెల్లి రవీందర్(50) ఇంటి వద్ద స్విచ్ బోర్డు వైరుకు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. చికిత్స నిమిత్తం అతడిని స్థానికులు ఎంజీఎం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరిలించినట్లు స్థానికులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
★I, RAJENDER CHENNOJI, S/O. VEERACHARY (Old Name), R/o. H.No. 35-3-241, Gopalapuram, Hanamkonda Dist., T.S., have changed my name as CHENNOJU RAJENDER, S/O. VEERACHARY (New name). NTW-00

**CHANGE OF NAME**
★I, AAKULA SREEDHAR, S/O. AKULA SAILU (Old Name), R/o. H.No. 5-4-46, Kothur Street, Sabeer Hotel, Hanamkonda, Warangal, Hanumakonda, T.S.,- 506001, India, have changed my name to AKULA SRIDHAR (New name) solemnly Declare. NTW-00

**CHANGE OF NAME**
★I, AKBARULLA BAIG (Old Name), S/o. VALIULLA BAIG, R/o. H.No. 2-7-837, Alipura, Subedari, Hanamkonda. have changed my name as MIRZA AKBARULLA BAIG (New name), S/o. VALIULLA BAIG. NTW-00

**CHANGE OF NAME**
★I, SHAIK HUSSAIN, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as MOHAMMED SHAIK HUSSAIN, S/o. Mohammed Shaik Ali. NT-328421

★I, SHAIK ALI, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as MOHAMMED SHAIK ALI. NT-328421

★I, ZAHARA BEE, R/o. 10-9-4/1, Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as ZAHERA BEGUM, W/o. Mohammed Shaik Ali. NT-328421

★I, NAJMUNNISA BEGAM, R/o. 10-9-4/1 Charbouli, Girmajipet, Warangal, TS. Hence forth shall be known as NAJMUNNISA BEGUM, W/o. Mohammed Shaik Hussain. NT-328421

★I, MOHAMMED TALAHA UDDIN, R/o. 1-9-613/A, Basith Nagar, Julywada, Warangal-Hanumakonda, TS. Hence forth shall be known as MOHAMMED TALHA UDDIN, S/o. Abutaha Mohammed Abdul Raheem. NT-328421

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పరీక్ష కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు

నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

# ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

గిర్మాజీపేట/హనుమకొండ చౌరస్తా, మార్చి 18 : వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లాలో మొదటిరోజు తెలుగు పరీక్షకు 99.83 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో డీ వాసంతి తెలిపారు. 9,448 రెగ్యులర్ విద్యార్థులకు 9,432 హాజరు కాగా 16 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే, 8 మంది ప్రైవేట్ విద్యార్థులకు నలుగురు హాజరైనట్లు డీఈవో వెల్లడించారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అలాగే, హనుమకొండ జిల్లాలో మొత్తం 68 పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,014 మందికి 12,000 మంది విద్యార్థులు (99.88 శాతం) హాజరయ్యారు. అలాగే, ప్రైవేట్ విద్యార్థులు నలుగురు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎండీ అబ్దుల్ హై, ప్రభుత్వ పరీక్షల సహాయ నిర్వహణాధికారి చలపతిరావు తెలిపారు.

**పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి : హనుమకొండ కలెక్టర్**

హనుమకొండ : పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల, షైన్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హనుమకొండ : పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## తనిఖీల్లో బంగారం పట్టివేత

ఐనవోలు, మార్చి 18 : ఎన్నిక కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సోమవారం మండలంలోని పున్నేల్ క్రాస్ వద్ద సీఆర్పీఎఫ్, పోలీసు సిబ్బందితో కలిసి ఎస్సై అనిల్‌కుమార్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో రూ.11,13,976 విలువైన బంగారం, వెండి ఆభరణాలను పట్టుకున్నట్లు తెలిపారు. విచారణ కోసం ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌ను కొట్టిన ప్రయాణికుడిపై కేసు నమోదు

ఆత్మకూరు, మార్చి 18 : ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌ను దుర్భాషలాడుతూ కొట్టిన ప్రయాణికుడిపై ఎస్సై రాజేశ్‌రెడ్డి సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. భూపాలపల్లి నుంచి హనుమకొండకు వెళ్తున్న బస్సు ఆత్మకూరు మండలం కొత్తగట్టు స్టేజీ వద్దకు రాగానే ఖిలా వరంగల్‌కు చెందిన చంద రాజు డోర్ వద్దకు వచ్చి నిల్చున్నాడు. లోపలికి పొమ్మని డ్రైవర్ మురళీ చెప్పినా వినకుండా బూతులు తిట్టి కొట్టాడు. మహిళా కండక్టర్ సునీత జోక్యం చేసుకోగా, ఆమెను కూడా తిడుతూ చేయి చేసుకున్నాడు. డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు మేరకు చంద రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

## 'ఇబ్బంది పెడుతున్న ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి'

పరకాల, మార్చి 18 : ప్రయోజనాల చెల్లింపులకు సంబంధించిన ఫైల్స్‌పై సంతకం చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న పరకాల ఎంఈవో రమాదేవిపై చర్యలు తీసుకోవాలని పరకాలకు చెందిన బాధితురాలు గోవిందు సుగుణ జిల్లా అధికారులను కోరారు. సుగుణ భర్త గోవిందు జోసెఫ్ ఉమ్మడి పరకాల మండలంలోని రాయపర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ప్రయోజనాల చెల్లింపు విషయంలో కోర్టులో కేసు ఉండగా గత ఏడాది సుగుణ కుటుంబానికి అనుకూలంగా తీర్పు వచ్చింది. సంబంధిత ఫైల్స్‌పై సంతకం చేయకుండా స్థానిక ఎంఈవో కాలయాపన చేస్తున్నది. విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నదని, వెంటనే ఎంఈవోపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితురాలు అధికారులను వేడుకున్నది. కాగా, ఈ విషయంపై ఎంఈవో వివరణ కోరగా పరీక్షల సీజన్ కావడం వల్ల కాలయాపన జరుగుతున్నదని, జిల్లా అధికారులను సంప్రదించి ఫైల్స్‌ను క్లియర్ చేస్తానని చెప్పారు.

## స్నేహితుడి కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం

ఖానాపురం, మార్చి 18: చిన్ననాడు కలిసి చదువుకున్న మిత్రులంతా తమ మిత్రుడి కుమార్తె వివాహానికి రూ.30,116 ఆర్థిక సాయం అందించారు. కొత్తూరు గ్రామానికి చెందిన మరాటి పాపయ్య కుమార్తె వివాహం జరిగింది. ఖానాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-97లో టెన్త్ పూర్తి చేసిన మిత్రులంతా హాజరై సోమవారం ఆర్థికసాయం అందించారు. మిత్రులు అక్బర్, అజహర్, హైమద్, సుధాకర్, వీరన్న పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన ఇద్దరు ఎంవీఐలు

గిర్మాజీపేట, మార్చి 18: ఆర్టీఏ కార్యాలయంలో నూతనంగా ఇద్దరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు జయపాల్‌రెడ్డి, శోభన్‌బాబు సోమవారం విధుల్లో చేరారు. జయపాల్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం నుండి, శోభన్‌బాబు కరీంనగర్ రాజన్నసిరిసిల్లా జిల్లాలో పనిచేసి బదిలీపై జిల్లాకు వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సిబ్బంది వారికి స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

సుబేదారి, మార్చి 18 : డ్రైంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి రూ.7,200 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ షుకూర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్‌లు నడిపిన నలుగురి మైనర్లకు రూ.4వేల జరిమానా విధించినట్లు చెప్పారు.

## ఎస్సై బాధ్యతల స్వీకరణ

నల్లబెల్లి, మార్చి 18 : నల్లబెల్లి ఎస్సైగా బీ రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నైనాల నగేశ్ వరంగల్ వీఆర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న రామారావు బదిలీపై వచ్చారు.

# తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వొద్దు

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ధర్మసాగర్, వడ్డేపల్లి రిజర్వాయర్ల పరిశీలన

వరంగల్, మార్చి 18 : తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం ధర్మసాగర్‌లోని 60 ఎంఎల్‌డీ, వడ్డేపల్లి రిజర్వాయర్ల వద్ద నీటి సరఫరా తీరును పరిశీలించారు. ధర్మసాగర్ ఇంటెక్ వెల్ నుంచి నగరంలోని మూడు ఫిల్టర్‌బెడ్‌లకు తాగునీటి సరఫరా విధానం, ల్యాబ్‌లో నీటి నాణ్యత నిర్ధారణ, క్లోరినేషన్ ప్రక్రియను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాలో సమస్యలు తతెత్తకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి, తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈలు బీఎల్ శ్రీనివాసరావు, డీఈ సంతోష్‌రావు, అజ్మీరా శ్రీకాంత్, మిషన్ భగీరథ డీఈ జీవన్, ఏఈ మహేశ్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

**వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు..**

వరంగల్ : నీటి ఎద్దడి నివారణపై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ సోమవారం హైదరాబాద్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రేటర్ నుంచి హాజరైన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నగరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను వివరించారు. నగరంలో రోజూ 180 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం ఉందన్నారు. ఎస్ఈ కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికిరణ్, సారంగం, రవికుమార్, రంగారావు పాల్గొన్నారు.

# పదోతరగతి ప్రశ్నపత్రం లీకైందా?

- ఉదయం 10.30కు లీకైనట్లు సమాచారం
- నల్లబెల్లిలో తెరుచుకున్న జిరాక్స్ సెంటర్
- నకల్ చీటీలు అందించేందుకు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, యువకుల ఉత్సాహం

నల్లబెల్లిలో జిరాక్స్ సెంటర్ వద్ద నకల్ చీటీలను జిరాక్స్ తీసుకుంటున్న యువకులు

నల్లబెల్లి, మార్చి 18: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలో మాస్‌కాపీయింగ్ జరిగినట్లు సమాచారం. దీన్ని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని రుద్రగూడెం, నల్లబెల్లి జడ్పీహెచ్ఎస్‌లతో పాటు కారుణ్య జ్యోతి ప్రైవేట్ స్కూల్‌లో టెన్త్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 392 మందికి వందశాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అయితే, ఉదయం 9.30కు పరీక్ష ప్రారంభం కాగా, 10.30 గంటలకే ప్రశ్నాపత్రం బయటకు రావడంతో మండలకేంద్రంలోని యూనియన్ బ్యాంకు వద్ద తెరిచిన జిరాక్స్ సెంటర్‌లో నకల్ చీటీలను జిరాక్స్ తీసుకునేందుకు యువకులు ఎగబడ్డారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన సదరు జిరాక్స్ సెంటర్ యజమాని ఒక్కో నకల్ చీటీకి రూ.10 తీసుకుని యువకులకు అందజేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా రుద్రగూడెం, నల్లబెల్లి జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ అధికంగా జరిగినట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉంటే.. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజు చెల్లించి చదివిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యువకులు పరీక్ష రాసే విద్యార్థులకు నకల్ చీటీలు అందించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద పడిగాపులు కాయడం గమనార్హం. మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినప్పటికీ నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కాజీపేటలో కవాతు చేస్తున్న పోలీసులు

## సాయుధ పోలీసుల కవాతు

కాజీపేట, మార్చి 18 : కాజీపేటలో సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి సోమవారం స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని చౌరస్తా నుంచి కవాతు ప్రారంభించి, మెయిన్ రోడ్డులోని జామా మసీదు, సెయింట్ ఆంథోని చర్చి, కూరగాయాల మార్కెట్ మీదుగా బాపూజీనగర్ (కడిపికొండ) ఆర్వోబీ వరకు, చౌరస్తా నుంచి నిట్ కళాశాల వరకు కవాతు చేపట్టారు. కాజీపేట ఏసీపీ తిరుమల్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగబాబు, ఎస్సైలు శివకృష్ణ, నవీన్ కుమార్, లవన్‌కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

కాశీబుగ్గ, మార్చి 18: క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని వరంగల్ డీఎస్‌డీవో సత్యవాణి సూచించారు. వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జై జవాన్ జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరుగనున్న 45వ జాతీయ హ్యాండ్‌బాల్ బాలుర చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న జట్టుకు సత్యవాణి సూచనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పవన్‌కుమార్, నిర్వాహకులు ఇట్యాల శ్రీనివాస్, జన్ను కుమార్, మేకల ధర్మేందర్, జన్ను స్వామి పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమదేవరపల్లి, మార్చి 18 : ఎస్ఎస్ఎస్‌లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని ముత్తారం, గట్లనర్సింగాపూర్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ప్రారంభించారు. పశువులకు కృత్రిమ గర్భధారణ చేస్తే అధిక పాల దిగుబడి సాధించి ఆర్థికాభివృద్ధి సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జేడీ బాలకృష్ణ, టీఎస్ఎల్‌డీఏ ఈవో శ్రీధర్, ముల్కనూరు మహిళా సహకార డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జీఎం మారుపాటి భాస్కర్‌రెడ్డి, రిటైర్డ్ జేడీ సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

# కాజీపేటలో దొంగ చేతివాటం

- చిరు వ్యాపారులే టార్గెట్..
- క్షణాల్లో గల్లాపెట్టెల్లోని డబ్బులతో ఉడాయింపు
- బాధితుల ఫిర్యాదుతో పోలీసుల గాలింపు చర్యలు

కాజీపేట, మార్చి 18 : పట్టణంలో కొంతకాలంగా ఓ గుర్తు తెలియని వ్యక్తి చిరువ్యాపారులను మాటల్లో పెట్టి గల్లా పెట్టెల్లోని నగదుతో ఉడాయిస్తున్నాడు. పండ్లు, పూలు, చిరు వ్యాపారుల దుకాణాలను లక్ష్యంగా చేసుకుని తన పని ముగించుకుని క్షణాల్లో పారిపోతున్నాడు. చిరువ్యాపారుల కథనం ప్రకారం.. పట్టణంలో కొంత కాలంగా ఓ వ్యక్తి పండ్లు, పూలు, కూరగాయల దుకాణాల ఎదుట బైక్‌ను ఆపి కొనేందుకు వచ్చినట్లు వ్యాపారులను నమ్మిస్తున్నాడు. వ్యాపారులు పండ్లు, పూలు, కూరగాయలు ప్యాక్ చేస్తుండగా, తీసుకెళ్లేందుకు సంచి లేదని చెబుతున్నాడు. వ్యాపారులు తమ వద్ద ఉన్న సంచి ఇచ్చేందుకు పక్కకు జరగ్గానే గల్లా పెట్టెల్లోని డబ్బును మాయం చేస్తున్నాడు. ఇప్పుడే సంచి తెచ్చుకుంటానని బైక్‌పై ఉడాయిస్తున్నాడు. తర్వాత వ్యాపారులు గల్లా పెట్టెలను తెరిచి చూసుకుని డబ్బులు కనిపించకపోవడంతో లబోదిబోమంటున్నారు. దసరా పండుగ ముందు నుంచి దాదాపు 10 మంది చిరు వ్యాపారుల దుకాణాల్లో దొంగ చేతివాటం ప్రదర్శించి దాదాపు లక్ష రూపాయలకు పైగా అపహరించుకుపోయాడు. అలాగే, తస్కరించిన వ్యాపారుల సెల్‌ఫోన్లను నిర్మానుష్య ప్రాంతాల్లో పడేస్తున్నాడని బాధితులు అంటున్నారు. బాధిత చిరు వ్యాపారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడి కోసం క్రైం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ఓ పండ్ల దుకాణంలో ఓ దొంగ చేతివాటం ప్రదర్శించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, గతంలో కాజీపేటలో చిరు వ్యాపారుల నగదును ఎత్తుకెళ్లిన దొంగ అయి ఉండొచ్చని అనుకుంటున్నారు.

## 'నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు అన్యాయం'

హనుమకొండ, మార్చి 18 : తెలంగాణలో ఎస్సీ డిక్లరేషన్ పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ పదవుల్లో ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేశ్ ఖన్నా ఆరోపించారు. సోమవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం పాటిస్తామని మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తన వర్గానికి ఎక్కువగా నామినేట్ పదవులు కేటాయించి ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసీలకు 17, బీసీలకు 13, ముస్లింలకు 3, ఎస్టీలకు 3 ఇచ్చి ఎస్సీలకు ఒక్క నామినేటెడ్ పదవి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీన్ని ఎంఆర్పీఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు మాయమాటలతో తెలంగాణలో అత్యధికంగా ఉన్న ఎస్సీ సామాజిక వర్గం ఓట్లను దండుకుని తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. పారిశుధ్య కార్మికుల రెగ్యులరైజేషన్‌తో పాటు డప్పు, చెప్పు, వృత్తిదారులకూ సొసైటీల ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకుంటే ఎంపీ ఎలక్షన్స్‌లో మాదిగల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేడ స్వామి, సిలువేరు సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి ప్రతాప్, ప్రధాన కార్యదర్శి పోగుల రాకేశ్, జిల్లా యువసేన అధ్యక్షుడు గంగారపు యశ్వంత్ పాల్గొన్నారు.

చైతన్యపురి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి పల్లకీ మోస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

## దైవభక్తితో మానసిక ఆనందం

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ